
# (ఆ)వేదన

పి.వి.బి.శ్రీరామమూర్తి



"ప్రియమైన రజనీష్ బాబూ!

నీకు నా ఆశీస్సులు.

నిన్న రాత్రే చాలాసేపు నీతో ఫోన్‌లో మాట్లాడినా... నీ మనసును తెలుసుకోగలిగానే కానీ... నా మనసును నీకు చెప్పలేకపోయాను. ఒక రకంగా చెప్పాలంటే నువ్వు నాకు ఆ అవకాశం ఇవ్వలేదు. ఎదుట వాళ్ళు మాట్లాడ్డానికి అవకాశం లేకుండా... తమ అభిమతాన్నీ, అధికారాన్నీ ఇతరుల మీద బలవంతంగా రుద్దటం కొంతమందికి పుట్టుకతో వచ్చిన కళ!

నాకిప్పటికీ గుర్తే!

ఆరోజు నువ్వు ఇంజనీరింగ్‌లో జాయినవుతానన్నావ్. నిజానికి నిన్నప్పట్లో ఇంజనీరింగ్ చదివించే శక్తి నాకు లేదు.

"అమ్మా!... అమ్మా!... నాకు ఇంజనీరింగ్ సీటొచ్చిందమ్మా! మీరు కొన్నాళ్ళు కష్టపడితే మన కష్టాలన్నీ గట్టెక్కిపోతాయమ్మా!" అని అమ్మను పట్టుకొని బతిమలాడావు.

"తప్పకుండా, నా బంగారు తండ్రి, నీ మాటను నేను కాదనగలనా?" అని మీ అమ్మ అంది. అప్పుడే, "కాంతం! ఆ విషయాలన్నీ తరువాత, ముందన్నాలు పెట్టు" అని అప్పటికి విషయాన్ని దాటేసాను.

ఆ రాత్రి -

మీ అమ్మ "ఏమండీ! బాబు ఏమన్నాడో తెలుసా? వాడింజనీరవగానే, అమెరికా వెళ్తాట్ట, అమెరికాకి విమానంలో వెళ్తాట్టండీ. నిజంగా ఎంతదురుష్టమండీ! మనమిప్పటికి ట్రైనెక్కిందే రెండు సార్లు. ఏమన్నాడో తెలుసా? నాకంటా... బంగారు గొలుసూ... చేతులకు గాజులు... మెళ్ళోకి నల్లపూసల తాడూ.... మీకేమో నాలుగు వేళ్ళకూ ఉంగరాలు... అవునూ... అంతలేసి జీతాలట... అబ్బ... మనకేంటండీ... ముష్టి జీతాలు... అన్నీ చేయిస్తాట్ట" అని మీ అమ్మ ఆశల అంతరిక్షంలో తేలుతోంటే వాటిని భగ్నం చెయ్యటం ఇష్టం లేక,

"కాంతం! పడుకో, మనం ఇద్దరమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేసిన అప్పు ఎన్ని వేలుందో తెలుసా? యాభయివేలు! అబ్బాయిని ఇంజనీరింగ్ చదివించాలంటే లక్షలుండాలి... లక్షలు! నేనా మామూలు గ్రామ మునసబుని. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు" అన్నానని రాత్రి మీ అమ్మ ఒకటే ఏడుపు.

ఆ మర్నాడు తెల్లారి మా స్నేహితుని దగ్గరకెళ్ళాను సలహా కోసం. అతనేమన్నాడో తెలుసా? "దశరథా! గొప్ప సమస్యని తెచ్చావయ్యా! నిజానికి మీవాడికి ఇంజనీరింగ్‌లో అంత మంచి గ్రూప్ రావటం చాలా గొప్ప విషయమే! అయితే నువ్వున్న పరిస్థితిలో చదివించటమూ కష్టమే! తొందరపడి మీ అబ్బాయిని ఏ టీచర్ ట్రయినింగ్‌కో పంపమని నేను సలహా ఇచ్చానే అనుకో.. ఈ చలపతిగాడు 'నాకొడుకు' గొప్పవాడవటం ఇష్టం లేకనే అలా చెప్పాడనుకోవచ్చు. లేదూ, ఇంజనీర్‌ని చెయ్యమన్నానే అనుకో... నీకు డబ్బు సర్దుకోలేని పరిస్థితి వచ్చినప్పుడల్లా... నన్ను తిట్టుకోక మానవు. అందుకని మీ కుటుంబ సభ్యులంతా కూర్చొని ఆలోచించుకోవటం మంచిదని నా సలహా!" అని అన్నాడతడు.

అప్పుడే నీకు పరిస్థితిని వివరించాను.

నువ్వు రెండు రోజులు తిండి మానేసావ్.

అయితే నువ్వు తెలివైనవాడివి. పట్టుదల గలవాడివి. అందుకే ఇంజనీరింగ్‌లో చేరటమేగాక, అక్కడా రేంకు తెచ్చుకున్నావ్. ఫలితంగా నేను ఇల్లు లేని నిరాశ్రయుణ్ణయ్యాను అప్పట్లో.

నీకు బొంబాయిలో మంచి ఉద్యోగం దొరికింది. ప్రతినెలా ఆరువేలు రూపాయలు పంపేవాడివి. సంవత్సరంలోనే నువ్వన్నట్లు అమ్మ చేతులకు బంగారు గాజులు, మెళ్ళోకి పూసల తాడూ, నల్లపూసలూ వచ్చి అమ్మ ముఖం బంగారంతో మెరిసిపోయింది. నా వేళ్ళకి ఉంగరాలు, మెళ్ళో బంగారు గొలుసూ... తళతళ కదల్తున్నపుడు నాకే అనిపించింది నీ నిర్ణయం... మీ అమ్మ పట్టుదల అంత గొప్పది కాకపోతే... నువ్వు మామూలు బడి పంతులివే అయి... నెలకి ఏ రెండొందలో పంపుతూ.. ఓ అమ్మాయిని చేసుకొని... మొత్తం సంసారం ఈదలేక... మాకూ డబ్బులు పంపలేక... మధ్య తరగతి ఇరుకు మనస్తత్వాల మధ్య నలిగి... నువ్వు బాధపడితే.. నా కొడుకు పెళ్ళాం వచ్చాక నన్ను మరిచిపోయాడని నేను నలుగురితో చెప్పుకొని తిరగవలసిన వాణ్ణో కదా!" అనిపించింది.

అప్పుడు నిన్ను తలుచుకుని ఎంత గర్వించానో!

కానీ... ఏమూలనో ఓ అనుమానపు తెర.. భయం పొర... నన్నప్పుడపుడూ నిద్రపోనిచ్చేది కాదు!

అదోరోజు నిజమైంది.

నువ్వు బొంబాయి నుండి వస్తూనే మా

పెద్దలకి నమస్కారం చేసి, మా కోసం తెచ్చిన వస్తువులు మా ముందుంచినపుడు మేం పొందిన ఆనందం అంతులేనిది. అయితే... అదెంతో సేపు నిలవలేదు. 'నీ అమెరికా ప్రయాణం' గురించి చెప్పేటప్పటికి... ఆ ఆనందం మీద విషాదపు తెరలు కమ్మేశాయి!

నిజానికి నువ్వమెరికా వెళ్తావంటే ఓ కంట ఆనందం.. మరో కంట విషాదం! జీవితపు చివరి పేజీలో ఉన్న మేం ఏ క్షణం ఎలా ఉంటామో.. ఆ క్షణానికి నువ్వెక్కడుంటావో అన్నదే మా ఆందోళన!

మేం కాదన్నా.. మమ్మల్ని నువ్వు ఒప్పించగలవు.

అలానే ఒప్పించావు కూడా!

రెండు సంవత్సరాల తరువాత. అమ్మ గోల పెడితే వచ్చావు. వచ్చిన మర్నాడే.. పెద్దింటి పిల్లను చూసి... ఆ మర్నాడే పెళ్ళి చేసుకొని... శోభనం కూడా అమెరికాలోనే జరుపుకోటానికి ముహూర్తాలు పెట్టించుకుని, సెలవు లేదని నువ్వెళ్ళిపోతున్నప్పుడు.... నేననుకున్నది నిజమైంది. నా భయం యదార్థమయింది. మేం కోల్పోయింది మాకు తెలిసొచ్చింది!

"ఏమండీ, ఈ పెళ్ళేమిటి? ఈ ప్రయాణం ఏమిటి? ఏడడుగులూ లేవు... ఏన్నాళ్ళూ లేవు.. అంతా కలలా అయిపోయిందేమండీ!" అని మీ అమ్మ ఒకటే గోల!

అప్పట్నించే మీ అమ్మ ఆరోగ్యం దెబ్బతింది. ఓ 'గోంగూర పచ్చడి' చేస్తే.. 'ఏమండీ, అబ్బాయికిష్టమని చేశానండీ!" అని ముచ్చంకాయ కూర చేసి.. ఈ ఉల్లికారంతోనే వాడు పళ్ళెం అన్నం తినేవాడండీ" అని, "అన్నట్టు శ్రీరామనవమి... వాడి పుట్టిన్రోజు సుమండీ! బొబ్బట్లు, పులిహోర వాడికోసమే చేశానండీ.." అంటూ అప్పుడే నవ్వి, అప్పటికే ఏడుస్తున్నపుడు మీ అమ్మ పిచ్చిదయిపోతుందేమోననిపించింది. డాక్టర్ ఆమెకు మత్తు ఇంజక్షన్లూ, నిద్రమాత్రలూ ఇచ్చి నీ ఆలోచనల్నించి మళ్ళించాడు.

నువ్వు అమెరికాలో ఇల్లు కొనుక్కున్నావని రాసినపుడు మాకూ మనవణ్ణి అందించావని చెప్పినపుడు ... ఆ ... ఆనందం కంటే.... బాధే ఎక్కువ అనుభవించాం... కారణం... మా మనవడితో... ముచ్చటగా ఆడుకునే అదృష్టం మాకు కరువైనందుకు!

"ఏమండీ, బాబుని చూసి మూడేళ్ళు దగ్గరవుతోంది. ఓసారి రమ్మనండి" అని మీ అమ్మంటే.. "సర్లే పంపింది నువ్వేగా... నువ్వే చెప్పు" అన్నాను.

ఆరోజు నువ్వు ఫోన్ చేశావు!

మీ అమ్మ విన్ను రమ్మంది. ఒక్క

# ప్రేమ

**ప్రేమ** - దేవునితో, సేవ రూపాన్ని ధరిస్తుంది

ప్రేమ - తల్లితో మమత రూపాన్ని ధరిస్తుంది

ప్రేమ - తోబుట్టువుతో ఆప్యాయత రూపాన్ని ధరిస్తుంది

ప్రేమ - ప్రేయసితో అనుబంధ రూపాన్ని ధరిస్తుంది

ప్రేమ - స్నేహితునితో ఆత్మీయత రూపాన్ని ధరిస్తుంది

ప్రేమ - గురువుతో గౌరవ రూపాన్ని ధరిస్తుంది

ఏ రూపము ధరించినా ప్రేమ, మనస్సుతో సంబంధం పెట్టుకుంటుంది

పవిత్ర భావాన్ని ఏర్పరుస్తుంది.

అదే పవిత్రమైన, నిజమైన ప్రేమ రూపము

**- డాక్టర్ షహనాజ్ బతుల్**

ఆరుమాసాల్లో నీకు ప్రమోషన్ వస్తుందని.. నీకు గ్రీన్‌కార్డు ఏదో వస్తుంది... అది రాగానే మమ్మల్నీ అమెరికా తీసుకెళ్తానని... నువ్వు చెప్పటంతో మీ అమ్మ ఆశల్లో తేలింది!

కానీ...

ఆమె అమెరికా రాలేకపోయింది!

అకస్మాత్తుగా... గుండె నొప్పి రావటం... ఆమె ప్రాణం.. అనంత వాయువుల్లో కలిసిపోవటం... నిన్నూ... కోడల్ని, మనవణ్ణి... నీ ఇంటినీ చూడాలన్న మీ అమ్మ కోరిక... ఆమెతోనే బుగ్గి అవటం... నిజంగా బాధాకరం!

నువ్వు ఫోన్లోనే చాలా బాధపడ్డావు.

నీవు రావటానికి వీలు పళ్ళేదు. అయినా అమ్మకి ఏ లోటూ చెయ్యకుండా నిజంగా హిరణ్యదానం, గోదానం, భూదానం... అన్నీ ఎంత ఖర్చయినా డబ్బుకోసం వెనకాడక చేయించమన్నావు. అలాగే చేశాను.

కోడలే చెప్పిందో, నువ్వే చెప్పమన్నావో నాకు తెలీదు. మనింటిప్రక్క 'మాలతమ్మ'ని మాకు వండి వడ్డించమని... అత్తగారు లేని విధంగా ఆ లోటు ఆమె భర్తీ చెయ్యటానికి ఎంత డబ్బునైనా పంపిస్తామని... ఈవిషయంలో ఎవరేమనుకున్నా బాధపడొద్దని కోడలు చెప్పింది.

మీ ఆలోచన నాకర్థమైంది.

బాబూ! నువ్వు తల్చుకుంటే... ఏదైనా చెయ్యగలవు. చేయించగలవు.. నాకు తెలుసు.

తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో.... పిల్లల్ని కంటారు. అయినా మన పిల్లల్ని, తమ పిల్లల్ని ఉన్నత పదవుల్లో.... ఉచ్ఛస్థితిలో చూడాలనుకోవటం..అందుకు కృషి చెయ్యటం... తల్లిదండ్రుల కర్తవ్యం!

అలాగే.... .

పిల్లలూ - 'వార్థక్యంలో తమ తల్లి తండ్రులను కంటికి రెప్పగా చూసుకోవటం' వారి బాధ్యత! ఎంతోమంది పిల్లలు తమ తల్లిదండ్రులను వార్థక్యంలో హీనస్థితిలో వదిలి... తమకేమీ కానట్లు ఉంటున్నారు. నువ్వలాంటి వాడివి కావు. నీకు తల్లి మీదా, తండ్రి మీదా ఎనలేని ప్రేమ. అయితే అంతకంటే కూడా డబ్బు మీద ఇంకా ప్రేమ, బాబూ! డబ్బుని ప్రేమించటం మొదలు పెట్టిన వానికి... జీవితంలో ఏ వస్తువుకన్నా... డబ్బే మిన్నగా కనిపిస్తుంది. అందుకే నువ్వు మాకు కావలసినంత డబ్బుని పంపుతున్నావు. కాదనలేను! కానీ బాబూ! వార్థక్యంలో మనిషికి కావలసింది డబ్బు కన్నా... మరో మనిషి తోడు... మాట సాయం.. మనసు విప్పి మాట్లాడుకోవటానికి మనుషులు... అది అందివ్వగలవాళ్ళు కన్న పిల్లలే కదా!

నిజానికి గుండె నొప్పితో మీ అమ్మ చుట్టుకుంటున్నప్పుడు ఆమె కన్నీటి పొరల్లో తేలియాడినది నీ రూపమే! ఆమె మనసునిండా ఆవరించిందీ నీ రూపమే! ఆమెకు నొప్పి రూపంలో మృత్యువై వచ్చిందీ నీ రూపమే!

అందుకే వార్థక్యం మనిషికి శాపం కారాదు.

పిల్లలు కన్న తల్లిదండ్రులను కంటికి రెప్పగా చూసుకుంటుంటే... ఆనందంగా... ప్రాణం విడుస్తున్నపుడున్న తృప్తి... ఎంత డబ్బూ... ఎన్ని సంపదలూ ఇవ్వలేవు.. అందుకే - మీ అమెరికా, డబ్బునే ఇవ్వగలదు. ప్రేమను పంచలేదు. ఇచ్చి పుచ్చుకోవటం అక్కడి వాళ్ళకు నేర్పగలిగితే... ఇక్కణ్నుంచి ప్రేమను అక్కడి మనుషులకి పంచి... వాళ్ళలో నింపి.. ఇక్కడున్న మాలాంటి ముసలి తల్లిదండ్రులను గురించి ఆలోచించేటట్లు చెయ్యమను!

ఇది నా సెంటిమెంట్ అనుకున్నా పరవాలేదు. కానీ... నా కొడుకు నా తల కొరివి పెడతాడన్న తృప్తి... అవసానంలో నా పిల్లలు నా దగ్గరే ఉన్నారన్న తృప్తి... ఇంతకంటే తల్లిదండ్రులింకేం కోరుకోరని నేను ఖచ్చితంగా చెప్పగలను!

బాబూ!

నీకష్టం కలిగించటం నా అభిమతం కాదు... అన్యథా భావించకు.. నా కోసం ఇక డబ్బు పంపనక్కర్లేదు... ఇది నా ఆవేదనే... అర్థం చేసుకో!

ఉంటా,

మీ నాన్న

దశరథరామయ్య